

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈవో, టీఎస్‌యుటీఎఫ్ ప్రతినిధులు

టీఎస్‌యుటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

సరూర్‌నగర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): టీఎస్‌యుటీఎఫ్ బాలాపూర్, సరూర్‌నగర్ మండలాల కమిటీల ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం-2024 క్యాలెండర్‌ను శుక్రవారం ఎంఈవో కృష్ణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ రామానుజన్‌రెడ్డి, యుటీఎఫ్ జిల్లా కార్యదర్శులు బండి గణేశ్‌కుమార్, శంకర్‌నాయక్, సరూర్‌నగర్ అధ్యక్షుడు తౌరియానాయక్, ప్రధాన కార్యదర్శి మల్లేశ్, బాలాపూర్ అధ్యక్షుడు జి.శంకరయ్య, ప్రధాన కార్యదర్శి డి.ఆంజనేయులు, సరూర్‌నగర్ మండల ఉపాధ్యక్షుడు జంగయ్య, కోశాధికారి దినేశ్‌కుమార్, కార్యదర్శి సురేశ్‌కుమార్, బాలాపూర్ మండల కార్యదర్శులు హుస్సేన్, బీరప్ప, సీనియర్ నాయకులు బాలయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధికి చర్యలు తీసుకోండి



భట్టి విక్రమార్కకు వినతిపత్రం ఇస్తున్న టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్

సైదాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నగర, శివారు ప్రాంతాలలో ఉన్న వ్యవసాయ మార్కెట్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధికి చర్యలు తసుకోవాలని కోరుతూ టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ శుక్రవారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం మార్కెట్ పాలకవర్గాల నియామకాలలో అస్తవ్యస్థంగా రిజర్వేషన్లు కల్పించి గందరగోళం చేసిందని పేర్కొన్నారు. కేవలం మార్కెట్ కమిటీలను రాజకీయ నేతలకు పునరావాసం కల్పించే విధంగా అనర్హులకు పదవులు కట్టబెట్టిందని తెలిపారు. ముఖ్యంగా మలకపేట వ్యవసాయ మార్కెట్, మాదన్నపేట, గుడిమల్కాపూర్, ఉస్మానగంజ్, కిషన్‌గంజ్ మార్కెట్లలో కనీస సౌకర్యాలు లేక రైతులు, వ్యాపారులు, వినియోగదారులు దయనీయ పరిస్థితులు ఎదుర్కొంటున్నారని వివరించారు. మార్కెట్లలో గత పదేళ్లుగా జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని కోరారు. సత్వరమే నూతన కమిటీలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు, రేపు రాష్ట్ర వ్యాప్తంగా టైపు రైటింగ్ పరీక్షలు

తార్నాక, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాంకేతిక విద్యాశాఖ, ఎస్.బి.టెట్ ఆధ్వర్యంలో ఈనెల 20, 21న రాష్ట్ర వ్యాప్తంగా టైపు రైటింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర టైపు రైటింగ్, షార్ట్ హ్యాండ్ కంప్యూటర్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాలిగ తెలిపారు. శుక్రవారం తార్నాకలోని టైపు రైటింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 22 పరీక్షా కేంద్రాల్లో తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ భాషల్లో జూనియర్ గ్రేడ్, లోయర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్, హై స్పీడ్ విభాగాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని, షార్ట్‌హ్యాండ్ పరీక్షలు ఈనెల 28న ఇంగ్లీష్, తెలుగు భాషల్లో నిర్వహిస్తామని తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు వెంకటేశం, ఫణికుమార్, రాజేశ్వర్, బాలరాజు, రామేశ్వరాచారి, ఓంప్రకాష్, నాగశ్రీ, పద్మ, చంద్రయ్య, రామారావు, శివ పాల్గొన్నారు.



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఏఐఎం సభ్యుడు షేక్ మొహమ్మద్ రఫీ

విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలి

నీతి అయోగ్ ఏఐఎం సభ్యుడు షేక్ మొహమ్మద్ రఫీ

సైదాబాద్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విస్తృతంగా ఆలోచించి నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని నీతి అయోగ్ అటల్ ఇన్నోవేషన్ మిషన్ (ఏఐఎం) సభ్యుడు. ప్రొఫెసర్ డాక్టర్ షేక్ మొహమ్మద్ రఫీ అన్నారు. మలకపేట ప్రభుత్వ పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను సందర్శించారు. విద్యార్థులు మొదటగా తమ ఆలోచనలను రాసిన తరువాత ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగించి మోడల్‌గా తయారు చేయాలని సూచించారు. విద్యార్థులలో ఉన్న సామర్థ్యాన్ని గుర్తించి వెలికితీయడమే ఉపాధ్యాయుల బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ మండల ఉప విద్యాశాఖాధికారి రాధాకృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, మెంటర్ మనోజ్, అనిల్, సైన్స్ టీచర్లు రాము, వెంకట్ రెడ్డి, వనజ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 6 వరకు గురుకుల పాఠశాల దరఖాస్తుకు గడువు

మన్సురాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ బండ్లగూడ ఆనంద్‌నగర్ చౌరస్తాలోని తెలంగాణ మైనారిటీ గురుకుల బాలికల పాఠశాల (బాలానగర్ గర్ల్స్)లలో 2024-25 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె.సంధ్య పేర్కొన్నారు. 6,7,8వ తరగతులలోనూ ఖాళీగా ఉన్న సీట్లలో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు మైనారిటీ(ముస్లిం, క్రిస్టియన్, జైన, బుద్ధ, పార్శి) విద్యార్థులతో పాటు నాన్ మైనారిటీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. వివరాలకు 7995057933 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



మట్టమ్మ

హయత్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల క్రితం ఓ వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హయత్‌నగర్ ఉషోదయనగర్ కాలనీలో నివాసం ఉండే చలికంటి మట్టమ్మ (65) గత కొంత కాలంగా మానసికంగా బాగాలేక అనారోగ్యంతో బాధపడుతుంది. కాగా గత శనివారం తెల్లవారుజామున మట్టమ్మ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. ఇప్పటివరకు తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వారం రోజులుగా వెతికినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం సాయంత్రం మట్టమ్మ కోడలు పార్వతమ్మ హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్‌షాపుల కేటాయింపులో బంధుప్రీతి తగదు

పునఃసమీక్షించాలని అధికారులకు కార్పొరేటర్ వినతి

సరూర్‌నగర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుద్యోగ, పేద మహిళలకు దక్కాల్సిన రేషన్ షాపులను ప్రజాప్రతినిధుల బంధువులకు, సన్నిహితులకు కేటాయించడం తగదని, అలా కేటాయించిన షాపులను రద్దు చేసి పునఃసమీక్ష జరిపి అర్హులకే దక్కేలా చర్యలు తీసుకోవాలని బడంగ్‌పేట్ 21వ డివిజన్ కార్పొరేటర్ బంగారు అనితాప్రభాకర్ అధికారులను కోరారు. ఈమేరకు శుక్రవారం ఆమె రంగారెడ్డి జిల్లా కలెక్టర్, కందుకూరు ఆర్డీవో, బాలాపూర్ తహసీల్దార్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అనితాప్రభాకర్ మాట్లాడుతూ బడంగ్‌పేట్‌లో గతంలో ఒకే రేషన్‌షాపు ఉండేదని, పెరిగిన కార్డుదారుల సంఖ్యకనుగుణంగా మరో నాలుగు షాపులు మంజూరు చేశారని అన్నారు. అయితే సదరు షాపుల కేటాయింపులో అధికారులు నిబంధనలను సరిగా పాటించలేదని, అప్పటి అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఒత్తిడికి తలొగ్గి వారి బంధువులకు, సన్నిహితులకు కేటాయించుకున్నారని ఆమె ఆరోపించారు.

దీనివల్ల అర్హులైన వారికి అన్యాయం జరిగిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దృష్ట్యా ఇక్కడ మంజూరైన 22,23,24,25వ నంబర్ రేషన్ షాపుల కేటాయింపుపై అధికారులు పునఃసమీక్ష జరిపి, నిష్పక్షపాతంగా అర్హులైన స్థానిక పేద మహిళలను గుర్తించి వారికి కేటాయించాలని అనితాప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



ట్రాఫిక్ నిబంధనలపై ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

- ప్రమాదాల నుంచి కాపాడుకోండి
- మలక్‌పేట ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్

సంతోష్‌నగర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క పౌరుడు ట్రాఫిక్ నింబంధనలను పాటించి, ప్రమాదాల నుంచి కాపాడుకోవాలని మలకపేట ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా శుక్రవారం నల్గొండ క్రాస్ రోడ్డులో మలకపేట ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నియమాలను తెలియజేస్తూ ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు సేఫ్టీ గురించి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన బాధ్యత కలిగి ఉండాలన్నారు. దేశంలో ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుండగా, ప్రతి మూడు నిమిషాలకు అదే రోడ్డు ప్రమాదంలో ఒకరు మృత్యువాత పడుతున్నారని తెలిపారు. ఎక్కువ శాతం అధిక వేగంతో రోడ్డుపై వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరుగుతుందని వాపోయారు. రోడ్డుపై వాహనాలు నడిపే ప్రతి ఒక్క వ్యక్తి ట్రాఫిక్ రూల్స్‌ని పాటించి, ఇతరులకు ఇబ్బంది కలుగకుండ జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వారి బాధ్యతగా భావించి రోడ్డు భద్రత వారోత్సవాల్లో పాల్గొని రోడ్డు సేఫ్టీ నియమాలు తెలుసుకొని పాటించాలని కోరారు. వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు తెలియజేస్తూ చాక్లెట్లు పంపిణీ చేశారు

మలక్‌పేటలో రోడ్డు భద్రతా వారోత్సవాలు

సైదాబాద్ : మలకపేట రవాణా కార్యాలయంలో శుక్రవారం రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది. దరఖాస్తుదారులతో ఆర్టీఓ సుభాష్‌చంద్రరెడ్డి రోడ్డు నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. బైక్ నడుపుతున్నవారు తప్పనిసరిగా హెల్మెట్, కారు డ్రైవర్లు సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం తాగి ఎట్టి పరిస్థితులలో వాహనాలు నడుపవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు రమేష్‌బాబు, అరుణ, ఏఓలు విజయ్‌ప్రవీణ్, మధుకర్, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బంది, దరఖాస్తుదారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్టీఓ సుభాష్‌చంద్ర రెడ్డి



'అయోధ్య' రామాలయ వీక్షణకు ఏర్పాట్లు

సరూర్‌నగర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో ఈనెల 22వ తేదీన జరగనున్న శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమాన్ని భక్తులు ప్రత్యక్షంగా వీక్షించేందుకుగాను బడంగ్‌పేట్‌లోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేకంగా ప్రొజెక్టర్ ఏర్పాటు చేస్తున్నట్టు ఆలయ ధర్మకర్త చక్రవర్తుల జగన్మోహనాచార్యులు తెలిపారు. సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక భజనలు, అర్చనలు, కోలాటనృత్యములు నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు. భక్తులు ఉదయాన్నే ఇక్కడకు వచ్చి ఆయా కార్యక్రమాల్లో పాల్గొని, అయోధ్య ఘట్టాన్ని వీక్షించి, అనంతరం తీర్థ ప్రసాదములు స్వీకరించాల్సిందిగా కోరారు.

శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో అఖండ దీపారాధన

వనస్థలిపురం, జనవరి 19(ఆంధ్ర జ్యోతి): అయోధ్యలో జరిగే రామ మందిర ప్రతిష్ఠ సందర్భంగా ఈనెల 22వరకు వనస్థలిపురం రైతుబజార్ సమీపంలోని శ్రీ భ్రమరాంబికా సమేత మలికార్జున స్వామి దేవస్థానంలో అఖండ దీపారాధన కార్యక్రమం కనుల పండువగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అఖండ దీపారాధన కార్యక్రమం ఈనెల 14 నుంచి 22వరకు ఉదయం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాలనీవాసులు అఖండదీపారాధన కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు.



ఎన్‌టీఆర్ స్టేడియంలో యాగం ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు శశిభూషణ్, వల్లూరి శివకోటేశ్వర రాజు, మునిపల్లె శ్రీనివాస్, తదితరులు

ఎన్‌టీఆర్ స్టేడియంలో 21 నుంచి కోటి ప్రత్యాంగిర మహాయాగం

కవాడిగూడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జగద్గురు సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి 88వ అవతరణోత్సవం సందర్భంగా శ్రీ సిద్ధేశ్వర పీఠం కుర్తాళం ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ స్టేడియంలో ఈనెల 21 నుంచి 28 వరకు దేశంలోనే తొలిసారిగా 108 హోమకుండాలతో 25వేల కిలోల ఎండు మిరపకాయలతో కోటి ప్రత్యాంగిర మహాయాగాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, పీఠం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మోచెర్ల శశిభూషణ్, ధర్మాధికారి వల్లూరు శివకోటేశ్వర రాజు, కోఆర్డినేటర్ మునిపల్లె శ్రీనివాస్, పీఠం పురోహితులు మాచవోలు రమేష్‌శర్మ తెలిపారు. శుక్రవారం యాగం ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ, ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం ఆరున్నర గంటల వరకు యాగం, సాయంత్రం 6.30 గంటలకు భక్తి సంగీతం, శ్రీ లలిత, శ్రీ విష్ణు, సౌందర్య లహరి, శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం ఉంటాయని తెలిపారు. రాత్రి 7.30 గంటలకు వివిధ దేవతామూర్తుల కల్యాణ మహోత్సవం, శ్రీ సిద్ధేశ్వరానంద భారతి అనుగ్రహ భాషణం ఉంటుందన్నారు. కార్యక్రమాలకు హాజరైన మొదటి పది వేల మంది భక్తులకు వివిధ దేవతల రూపు. కాసు, రుద్రాక్షలను ప్రసాదంగా అందజేస్తామని వారు వెల్లడించారు. కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులను ఆహ్వానిస్తామని వారు తెలిపారు. కోటి ప్రత్యాంగిర మహాయాగంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సంతోష్‌నగర్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11కేవీ తట్టిఅన్నారం, లక్ష్మిగణపతి, ఇందుఅరణ్య అపార్ట్‌మెంట్, ఇందుఅరణ్య హౌసింగ్, టీఎస్ హౌసింగ్‌బోర్డ్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో చెట్ల కొమ్మలు కొట్టివేత, నిర్వహణ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని డీఈ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

సరూర్‌నగర్: తుర్కయాంజాల్ సెక్షన్‌లోని నాదర్‌గుల్ విద్యుత్ ఉపకేంద్రంలో నిర్వహణ పనులు చేపట్టనున్నందున శనివారం మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు నాదర్‌గుల్, గుర్రంగూడ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బొజ్జ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

సైదాబాద్ : టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలోని మరమ్మతు పనుల కారణంగా శనివారం 11కేవీ సెవెన్ టెంపుల్ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాలలో ఉదయం 9 నుంచి 11గంటల వరకు, ఆజంపురా ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, డబీర్‌పురా ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాలలో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు, రోషన్ డైరీ ఫీడర్ పరిధిలో 4గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ హన్మంతరెడ్డి తెలిపారు.



రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను కలిసిన బడంగ్‌పేట్ కమిషనర్ బి.సుమన్‌రావు, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి

విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు

హైదరాబాద్ సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకునే విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అనీమియా ముక్త్ భారత్ కార్యాచరణపై సంక్షేమ, విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పరీక్షల అనంతరం హిమోగ్లోబిన్ శాతం తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి చికిత్స అందించాలన్నారు. ఎనీమియా ముక్త్ భారత్ మంచి కార్యక్రమమని, దీనిని విజయవంతం చేయడానికి అధికారులు కృషి చేయాలని కోరారు. అధికారులు బృందాలుగా ఏర్పడి విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటి, డీఐఓ శ్రీకళ, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఆశన్న, ఇంటర్మీడియట్ విద్యాధికారి ఒడ్డెన్న, ఎస్సీహెచ్‌వో, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఎన్‌డీపీ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని హుడా భారతీనగర్ కాలనీలో ఎస్ఎన్‌డీపీ కింద కొనసాగుతున్న డ్రైన్ నిర్మాణ పనులను శుక్రవారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పరిశీలించారు. పనులు కొనసాగుతున్న ప్రాంతంలో ఏర్పడిన ఇబ్బందులను కాలనీ ప్రతినిధులు, అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఇక్కడ ప్రారంభించిన ఎస్ఎన్‌డీపీ డ్రైన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు, ప్రస్తుతం పనులు జరుగుతున్న స్థలం ప్రైవేట్ వ్యక్తులదని, వారిని ఒప్పించి మరీ కొంత స్థలం వారికి ఇచ్చేవిధంగా మాట్లాడి పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు. అట్టి పనులు 45డిగ్రీల కోణంలో తీసుకుపోవడానికి సాధ్యం కాదని, 90 డిగ్రీల కోణంలో పనులు చేపట్టాలని అధికారులు పేర్కొన్నట్లు, పనులు జరుగుతున్న ప్రాంతంలో అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభంను పక్కకు తొలగించి 45డిగ్రీల కోణంలో పనులు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. దీంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్‌డీపీ ఈఈ కృష్ణయ్య, ఏఈలు కిరణ్, సాగర్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆందోజు సత్యంచారి, జీహెచ్ఎంసీ, ట్రాన్స్‌కో, జలమండలి అధికారులు విజయ్‌కుమార్, రాంచందర్, రవీందర్‌రెడ్డి, హేమునాయక్ పాల్గొన్నారు.



డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



సామ రంగారెడ్డిని అభినందిస్తున్న కృష్ణారెడ్డి తదితరులు

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా సామ రంగారెడ్డి

ఎల్బీనగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షునిగా సామ రంగారెడ్డి నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ ప్రక్షాళనలో భాగంగా పలువురు జిల్లా అధ్యక్షులను మార్చిన రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షునిగా సామ రంగారెడ్డిని కొనసాగించారు. ఆయన నాయకత్వంలోనే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు ఎక్కువమంది కార్పొరేటర్లుగా విజయం సాధించడంతో పాటు మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాలలో పార్టీ అభ్యర్థులు మెరుగైనరీతిలో ఓట్లు సాధించి ద్వితీయ స్థానంలో నిలవడం విదితమే. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకున్న పార్టీ అధిష్ఠానం రంగారెడ్డిని జిల్లా అధ్యక్షునిగా కొనసాగించాలని నిర్ణయించినట్లు సమాచారం. పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు విజయభేరి మోగించేలా పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని బీజేపీ అధిష్ఠానం నిర్ణయించింది.

అభినందనలు తెలిపిన పార్టీ శ్రేణులు

మన్సురాబాద్ : బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన సామ రంగారెడ్డిని.. ఆ పార్టీ స్వచ్ఛ భారత్ ఎల్బీనగర్ కన్వీనర్ గంగదాసు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాంపల్లి రామేశ్వర్, కృష్ణంరాజు, బాలకృష్ణ, జగన్ తదితరులు ఉన్నారు.

బడంగ్‌పేట్‌లో ఆర్టీసీ బస్ టెర్మినల్ ప్రారంభం

- మధ్యాహ్నం ఇక్కడే సిబ్బంది డ్యూటీ మార్పు

సరూర్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ మిథాని డిపో ఆధ్వర్యంలో బడంగ్‌పేట్‌లో కొత్తగా బస్ టెర్మినల్‌ను ఏర్పాటు చేశారు. ఇకపై మధ్యాహ్నం సమయంలో డ్యూటీ మారే సిబ్బంది ఇక్కడికే వచ్చి, అప్పటి వరకు వచ్చిన ఆదాయాన్ని అక్కడ అందుబాటులో ఉండే ఆర్టీసీ కంట్రోలర్‌కు అందజేయాల్సి ఉంటుంది. అనంతరం సెకండ్ షిఫ్ట్ సిబ్బంది విధుల్లో చేరనున్నారు. తద్వారా మధ్యాహ్నం ఆర్టీసీ బస్సులు మిథాని డిపోకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ప్రయాణికులకు, సిబ్బందికి అనువుగా ఉండే ఈ టెర్మినల్‌ను శుక్రవారం డీఎం ఆంజనేయులు, స్థానిక కార్పొరేటర్ గౌర రమాదేవిశ్రీనివాస్‌తో కలిసి బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని, దానికనుగుణంగా ప్రభుత్వం అదనపు బస్సులను నడుపుతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, బాలూనాయక్, బండారు మనోహర్, స్థానిక నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్‌రెడ్డి, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, వల్లపు సుభాన్‌యాదవ్, దీక్షిత్, ఆర్టీసీ టీఐ స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్‌లో ఆర్టీసీ బస్ టెర్మినల్‌ను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

ఈనెల 22న శ్రీరామోత్సవం



లక్ష దీపోత్సవం కార్యక్రమం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ వనపల్లి శ్రీనివాస్ రెడ్డి తదితరులు

వనస్థలిపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అయోధ్య శ్రీరామ జన్మభూమి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా శ్రీ ఎల్లమ్మదేవి దేవాలయం, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర వనస్థలిపురం ఆధ్వర్యంలో శ్రీరామోత్సవం.. లక్షదీపోత్సవం కార్యక్రమం ఎన్జీవోస్ కాలనీలోని ఛత్రపతి శివాజీ గ్రౌండ్స్‌లో ఈనెల 22న సాయంత్రం 6గంటల నుంచి అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు శ్రీ ఎల్లమ్మ దేవి దేవాలయ ఆలయ కమిటీ చైర్మన్ వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈమేరకు వనస్థలిపురంలో లక్ష దీపోత్సవ కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పవిత్రమైన అయోధ్య రామయ్య కొలువుదీరు శుభ సందర్భంగా వనస్థలిపురం పరిసర ప్రాంతాల ప్రజలందరు లక్ష దీపోత్సవం కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలన్నారు. ఇట్టి కార్యక్రమంలో వనస్థలి వేదపండితులచే వేదఘోష, శ్రీరామ జ్యోతి, మహిళలచే లక్ష దీపోత్సవం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, 20అడుగుల శ్రీరామ విగ్రహం అయోధ్య శ్రీభవ్య మందిర నమూనా ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

అక్రమ బోర్ సీజ్



మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలోని వినాయకనగర్ కాలనీలోని పార్కు స్థలంలో అనుమతి లేకుండా బోరు వేశారని స్థానికుడు హయత్‌నగర్ మండల రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆర్ఐ నరసింహ్మా వచ్చి బోరును సీజ్ చేశారు

- హయత్‌నగర్, ఆంధ్రజ్యోతి